సిబ్బంది విధులెక్కడో..

ఓటు అక్కడే..

- లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లు
- ఇతర నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగం
- మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో 313 సెక్టోరియల్ అధికారులు, 19,450 ఎన్నికల సిబ్బంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తప్పని సరిగా ఓటును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటు కలిగి ఉండి.. అదే నియోజకవర్గం పరిధిలో మరోచోట విధులు నిర్వర్తిస్తున్న వారికి ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) ద్వారా అక్కడే ఓటు వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం ఆ అవసరం లేకుండా విధులు నిర్వర్తించే చోట ఓటువేయవచ్చు.

ఈడీసీతో వినియోగం

ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) ద్వారా ఓటు వినియోగించుకునే వారందరూ ఫారం–12ఏ నింపి ఇవ్వాల్సి ఉంటుంది. పోలింగ్ తేదీకి ముందే ఈ దరఖాస్తును సహాయ రిటర్నింగ్ అధికారి(ఏఆర్వో)కి సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల విధుల వివరాలు, ఓటు ఉన్న శాసనసభ నియోజకవర్గం, గ్రామం, పట్టణం ఓటరు జాబితాలో వరుస సంఖ్య వంటి విషయాలు స్పష్టం చేయాల్సి ఉంటుంది. వాటిని పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు వినియోగించుకొనేందుకు అనుమతిస్తారు.

పరిధి మారితే పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు లేదా కింది స్థాయి సిబ్బంది ఎవరైనా వారు లోక్‌సభ నియోజకవర్గం పరిధి దాటి మరో నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వర్తించాల్సి వస్తే తప్పని సరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటోంది. సిబ్బంది ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటేనే అవకాశం ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్‌ను కూడా ఈడీసీ పద్ధతి మాదిరిగా ముందస్తుగా దరఖాస్తు స్వీకరించి ఓటు హక్కు కల్పిస్తారు. వీటిని ఆయా మండల కేంద్రాలు, శిక్షణ సమయంలో స్వీకరించి పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం కల్పిస్తారు.

ఎన్నికల సిబ్బంది 19,450 మంది

దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరి పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, ఎల్బీనగర్ ఉన్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో 313 మంది సెక్టోరల్ అధికారులు ఉండగా, 19,450 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



సోషల్ మీడియాలో అడ్డగోలుగా ప్రచారాలు

ఈ అభ్యర్థి గెలుస్తాడంటూ వాట్సాప్ పోస్టులు

రెచ్చిపోతున్న సోషల్ మీడియా వారియర్స్

సోషల్ మీడియాపై కొరవడిన నిఘా



ఉన్నది లేనట్టు..

లేనిది ఉన్నట్టు

మేడ్చల్: మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం అన్ని పార్టీలకు హాట్‌సీటుగా మారింది. దీంతో అన్ని పార్టీలు ఈ స్థానంపై స్పెషల్ ఫోకస్ పెట్టాయి. దాంతో ఆయా పార్టీల సోషల్ మీడియా వారియర్స్ రంగంలోకి దిగారు. ఏ ఒక్క అవకాశాన్ని వదలకుండా ఓటర్లను తమవైపు తిప్పుకొనేలా పోస్టులు పెడుతున్నారు. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ తదితర వాటిలో నిత్యం పోస్టులు పెడుతున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు లోబడి పోస్టులు ఉండాల్సి ఉన్నా.. కొంతమంది అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. సోషల్ మీడియా ఫాలోవర్స్‌ను ఇబ్బందులకు గురిచేస్తున్నా.. వారిపై నిఘా కరువైంది. తాము అభిమానించే అభ్యర్థుల ఫొటోలు, ఫేక్ సర్వే రిపోర్టులను ఇష్టానుసారంగా పోస్ట్ చేస్తున్నారు.

ప్రత్యేక వాట్సాప్ గ్రూపులు..

ఎన్నికల్లో మీడియా ప్రభావం ఎక్కువగా ఉండటంతో సోషల్ మీడియాను నేటి రాజకీయ నాయకులు ఎక్కువగా వాడుకుంటున్నారు. ప్రధానంగా వాట్సాప్, ఫేస్‌బుక్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. యూట్యూబ్‌కు కొంత వరకు నియంత్రణ ఉంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమ పరిధిలో ఉండే ఓటర్ల నంబర్లు సేకరించి గ్రూపులుగా తయారు చేస్తున్నారు. మా ఊరు, మన వార్డు, మన కాంగ్రెస్, మన బీజేపీ, మన బీఆర్ఎస్, పట్నం సైన్యం, ఈటల సైన్యం, ఆర్ఎల్ఆర్ సైన్యం తదితర పేర్లతో మున్సిపాలిటీ, మండలం, నియోజకవర్గం ఇలా వార్డుస్థాయి నుంచి గ్రూపులు ఏర్పాటు చేసి వాటి ద్వారా జోరుగా ప్రచారం చేస్తున్నారు. వారు పెట్టే పోస్టింగ్‌లు నిజమో కాదో ఎవరికీ తెలియదు.. కానీ గ్రూపుల్లో జోరుగా ప్రచారం చేస్తున్నారు. ఓ ప్రముఖ సర్వేలో తమ అభ్యర్థికి 70శాతం మంది ఓటర్లు మొగ్గుచూపారని, గెలుపుమాదే అంటూ ప్రచారాలు జోరుగా చేసుకుంటున్నారు. ఆ సర్వే ఎవరూ చేశారు.. ఏ సంస్థ చేసింది పోస్ట్ పెట్టిన వారికే తెలియదు.

ఈ రోజు ఎవరు టార్గెట్..?

రోజుకొక అంశం తీసుకుని ప్రచారం చేసే వారి ఫొటోలు పెట్టి అందంగా మేకప్ చేసి సందేశాలను విడుదల చేస్తున్నారు. ఫొటోలు పెట్టుకుని గ్రూపుల్లో ప్రచారాలు చేయడం, స్టేటస్ పెట్టుకోవాలని సూచించడం వంటి సందేశాలు ఎన్నో కనిపిస్తున్నాయి. ఈ రోజు ఎవరిని టార్గెట్ చేస్తున్నామో ముందుగానే వారి వ్యక్తిగత గ్రూపులలో చర్చించుకొని వాటి ప్రకారం పోస్టులు పెడుతున్నారు. ఫలానా నాయకుడి.. ఫలానా మీటింగ్‌లో ఇలా ప్రశ్నించాలి అంటూ మేసేజ్‌లు పంపుతున్నారు.

అదుపు చేయకపోవడంతో..

ఎన్నికల సమయంలో సోషల్ మీడియాను అదుపు చేయకపోవడంతో ఓటర్లకు అవస్థలు తప్పడం లేదు. వాట్సాప్ గ్రూపు అడ్మిన్లపై చర్యలు ఉంటాయని చట్టం చెబుతున్నా.. వాటిని పట్టించుకునే వారే కరువయ్యారు. కనీసం వాటిపై నిఘా ఉండటం లేదు. కొన్ని గ్రూపులలో అధికారులు ఉన్నా కనీసం వారు హెచ్చరించడం లేదు. సోషల్ మీడియాలో ఎవరికి వారే హీరో కావడంతో ఒక అంశం నిజమా, అబద్ధమా తెలుసుకోకుండా గ్రూపులలో పోస్టు చేస్తున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూపులో వందల సంఖ్యలో ఉన్న వారిపై ప్రభావం చూపుతోంది. ఎప్పుడో జరిగిన ఘటనల ఫొటోలు, వీడియోలు పోస్టు చేస్తుండటంతో పాటు కొన్ని మీమ్స్‌ను పోస్టు చేస్తున్నారు. నేతల మాటలను సినీ నటుల ఫొటోలతో వ్యంగ్యంగా డిజైన్ చేసి పోటీ చేస్తున్న వారిపై ప్రభావం చూపేలా పోస్టులు చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

బీజేపీని గెలిపించాలంటూ ప్రచారం



ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కీసర: కీసర గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన నాయకుల్లో అన్నోజిగూడెం మల్లారెడ్డి, చర్లపల్లి బలవంత్‌రెడ్డి, కొంటోళ్ల మల్లేష్, తమిశ్‌యేసు తదితరులున్నారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త పార్టీ విజయం కోసం కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తప్పకుండా తగిన సమయంలో గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలరెడ్డి, వెంకట్‌రెడ్డి, మెట్టు కృష్ణ, అయిలయ్య, కొలిచెలిమి కృష్ణ, చినంగిని సుధాకర్, మహేందర్ యాదవ్, నల్ల వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చిక్కుడు సత్యనారాయణ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో..

ఘట్‌కేసర్: కమలం గుర్తుకు ఓటేసి మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 296 బూత్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, 297 బూత్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం చేశారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు విప్పర్ల హనుమాన్, మల్కాజ్‌గిరి ప్రభారి గోలి మధుసూదన్‌రెడ్డి, కన్వీనర్ శ్రీనివాస్ హాజరై పేదలకు నరేంద్రమోదీ ప్రభుత్వం పేదలకు అందించిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు.



ఘట్‌కేసర్‌లో ప్రచారం చేస్తున్న హనుమాన్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్

బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలు

సభ అనంతరం ఎమ్మెల్యేలతో ర్యాలీగా మేడ్చల్ కలెక్టరేట్‌కు..



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మల్కాజిగిరి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. నామినేషన్ దాఖలు కార్యక్రమంలో ఆయన సతీమణి రాగిడి రజిని లక్ష్మారెడ్డి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూరి మల్లారెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. దీనికి ముందు తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని దొంగల మైసమ్మ గుడి వద్ద మైదానంలో ఎన్నికల సభను బీఆర్ఎస్ జిల్లా కమిటీ నిర్వహించింది. ఈ సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ సురభీ వాణి, ఎమ్మెల్యేలు సీహెచ్. మల్లారెడ్డి, కేపీ వివేకానందగౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ నగర మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి సీహెచ్ మహేందర్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి డాక్టరు సీహెచ్ భద్రారెడ్డి, నందికంటి శ్రీధర్, బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు. సభ అనంతరం ర్యాలీగా బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు



అర్షియ (986 మార్కులు)



లక్ష్మీ కవచ (984 మార్కులు)

విజ్ఞాన భారతి విద్యార్థులు



అంజిత సహాని (467/470)



తబసుమ్ (428/440)

మేడ్చల్: ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన స్ఫూర్తి కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. కళాశాలలో చదివే మేడ్చల్ విద్యార్థి అర్షియ రెండవ సంవత్సరంలో బైపీసీలో 1000 మార్కులకు గాను 986 మార్కులు సాధించింది. లక్ష్మీ కచవా ఎంపీసీలో 984 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో మోహన్‌పాఠక్ 464, కీర్తన 464 మార్కులు సాధించారు.

జవహర్‌నగర్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో జవహర్‌నగర్ విజ్ఞాన భారతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. విద్యార్థులు అంజిత సహాని ఎంపీసీలో 470 మార్కులకు 467, ఎస్‌కె.టీజీ తబసుమ్ బైపీసీలో 440 మార్కులకు 428 మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. అనంతరం విద్యార్థులకు కళాశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

ఫౌండేషన్ డే పండుగ ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం ఇంజినీరింగ్ కాలేజీ నుంచి సెంటినరీ పైలాన్ వరకు జరిగిన 2కె రన్‌ను వీసీ ప్రొ.రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఫౌండేషన్ డే భాగంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమామాలు ఉంటాయని నేడు, రేపు (25, 25) ఓపెన్ హౌస్, ఉస్మానియా కార్యక్రమాలలో భాగంగా ప్రసంగాలు, సదస్సులు, ఎగ్జిబిషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలలను విభాగాలను ముస్తాబు చేసినట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ఎస్ఎంఆర్ఈసీ గౌరవ అధ్యక్షుడు నల్లా మల్లారెడ్డి

ఘట్‌కేసర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవర్చుకుంటే ఉన్నత లక్ష్యాలకు చేరుకుంటారని నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఎంఆర్ఈసీ) గౌరవ అధ్యక్షుడు నల్లా మల్లారెడ్డి అన్నారు. కాచవానిసింగారం దివ్యానగర్ నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 13వ పారిశ్రామిక సంస్థ పరిశోధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి అవసరమైన ఆవిష్కరణల కోసం ప్రధానంగా దృష్టి సారించాలని, అవి సామాన్యులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. ప్రిన్సిపల్ రమేశ్, ఎంబీఏ హెచ్‌ఓడీ రాజశేఖర్, కాగ్నిజెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, జెన్ టెక్నాలజీ, నిఖిత ఇండస్ట్రీస్, నవనామి గ్రూపు, ఓయూ బిజినెస్ ఇంక్యూబేటర్, ఏకేఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ తదితర కంపెనీ ప్రతినిధులు అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎన్ఎంఆర్ఈసీ పారిశ్రామిక పరిశోధన సమావేశంలో ప్రతినిధులు

టాపర్లకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పద్మారెడ్డి, డైరెక్టర్ బాబుల్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీచైతన్య, రిషి కళాశాల విద్యార్థులను ఆ కళాశాల యాజమాన్యం బుధవారం అభినందించారు. ఇంటర్ ఫలితాల్లో బైపీసీ సీనియర్ విభాగంలో హర్షిత 990/1000, కల్యాణి 988/1000, ఎంపీసీలో మానస 986/1000, మనీష 981/1000, జూనియర్ విభాగంలో రిషిత 462/470, మాధురి 460/470, ఫాతిమా 432/440, మశ్చేందర్ 481/500 మార్కులు సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపల్ ఎస్.పద్మారెడ్డి, చైర్మన్ కె.పద్మారెడ్డి, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, బాబుల్‌రెడ్డి, అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో జీహెచ్ఎంసీ కార్మికుడి మృతి

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో జీహెచ్ఎంసీ కార్మికుడు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ సాయికృష్ణకాలనీలో నివసించే కృష్ణ(47) జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది క్రితం భార్య రాధ మృతి చెందడంతో అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. రెండ్రోజుల క్రితం తాను ఉంటున్న గదిలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రమైన దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

వివాహేతర సంబంధం వద్దన్నందుకు..

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: వివాహేతర సంబంధం కారణంగా కుటుంబ కలహాలు చోటుచేసుకొని చివరకు ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మునీరాబాద్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మునీరాబాద్ గ్రామానికి చెందిన మంత్రిగారి శ్రీకాంత్(33)కు భార్య మంజుల, ఇద్దరు సంతానం. శ్రీకాంత్ స్థానికంగా ఓ కంపెనీలో వెల్డర్. కొద్దికాలంగా అతడికి ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఇటీవల ఆ విషయం భార్యకు తెలియడంతో వారి మధ్య గొడవలు తలెత్తాయి. దీంతో మనస్థాపం చెందిన మంజుల వారం రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసింది. చికిత్స అనంతరం తిరిగి ఇంటికి చేరుకుంది. మంగళవారం తన భర్తకు నచ్చజెప్పి ఇప్పటికైనా ఆ మహిళకు దూరంగా ఉండాలంటూ కోరింది. శ్రీకాంత్ అందుకు ఒప్పుకోకపోవడంతో తిరిగి వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం విషయమై తాను పోలీసులకు ఫిర్యాదు చేస్తానంటూ ఆమె హెచ్చరించింది. దీంతో శ్రీకాంత్ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తన భర్త ఎంతకీ తిరిగి రాకపోవడంతో మంజుల మేడ్చల్ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయాన్ని వారికి వివరించింది. తన భర్త ఆచూకీ కనుక్కోవాలంటూ కోరింది. వెంటనే స్పందించిన పోలీసులు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా శ్రీకాంత్ లొకేషన్‌ను ట్రేస్ చేశారు. వారు ఆ ప్రాంతానికి చేరుకొనే లోపే అతడు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీకాంత్(ఫైల్)

దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో నూతనంగా నిర్మించిన శ్రీవేంకట మరకత చంద్రమౌళీశ్వర హనుమాన్ దేవస్థానంలో పలు దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మంగళవాయిద్యాలు, గోపూజ, గణపతి పూజ, అగ్ని ప్రతిష్ఠ, హారతి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూడూరు ఆంజనేయులు గౌడ్, ప్రధాన కార్యదర్శి కొకుంట్ల అనంతరెడ్డి, కౌన్సిలర్ గూడూరు సవిత తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాద వితరణలో భక్తులు

రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు



జవహర్‌నగర్ నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

జవహర్‌నగర్: బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ అహ్మద్‌పాషా ఆధ్వర్యంలో జవహర్‌నగర్ నుంచి కలెక్టరేట్ కార్యాలయానికి భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

శామీర్‌పేట్: అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్న వ్యక్తిని మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వివరాలు.. మేడ్చల్ జిల్లా జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐకేపీ నాలెడ్జ్ పార్క్ వద్ద అనుమతులు లేకుండా బండరాళ్ల బ్లాస్టింగ్ (పేలుళ్ల)కు పాల్పడుతున్న రమేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి క్రషర్ వాహనం, స్విచ్ బాక్స్, జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు జినోమ్ వ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కండక్టర్ బ్యాగ్ నుంచి నగదు చోరీ

మేడ్చల్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు ఆర్టీసీ బస్ కండక్టర్ సాయికుమార్ బ్యాగ్ నుంచి నగదు చోరి చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి రామాయంపేట నుంచి సికింద్రాబాద్ బయలుదేరింది. మార్గమధ్యలో బ్యాగును కండక్టర్ చూసుకోగా తన బ్యాగులో ఉండాల్సిన రూ.10 వేల నగదు కనిపించలేదు. దీంతో మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు !

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేడు సాయంత్రం నిర్వహించే ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు రాచకొండ కమిషనర్ కార్యాలయం పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ వైపు నుంచి ఉప్పల్ వైపు వచ్చే అన్ని భారీ వాహనాలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి11.30 వరకు దారి మళ్లించినట్లు తెలిపారు. వరంగల్ నుంచి వాహనాలు చెంగిచర్ల మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వరంగల్ నుంచి ఎల్బీనగర్ వెళ్లే వాహనాలు ఉప్పల్ బగాయత్ నుంచి దారి మళ్లిస్తున్నట్లు వివరించారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలు హబ్సిగూడ మీదుగా మల్లాపూర్, చర్లపల్లి చెంగిచర్ల మీదుగా వరంగల్ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

సస్పెన్షన్‌లో ఉన్న విద్యుత్ ఏఈ నివాసంలో ఏసీబీ సోదాలు



అల్వాల్: విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ సస్పెన్షన్‌లో ఉన్న అనిల్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ నేతృత్వంలో బొల్లారంలోని అనిల్ కుమార్ నివాసంలో ఉదయం నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రూ. 34 లక్షల నగదు, 20 తులాల బంగారం, ఆరు ప్లాట్లు, 4.5 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.1.76 కోట్లుగా నిర్ధారించారు. కీసరలో ఏఈగా పని చేస్తున్న అనిల్ కుమార్ 2023 ఫిబ్రవరిలో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల విచారణలో అతడికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు వెలుగులోకి రావడంతో అనిల్ కుమార్ తోపాటు అతని బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం ఆయన నివాసంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టనున్న బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.